


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

బుధవారం 30 జులై 2025 పేజీలు 08


### కేంద్రీయ విద్యాలయాల ద్వారా జ్ఞానం,

## క్రమశిక్షణతో కూడిన విద్య

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలల ద్వారా జ్ఞానం, క్రమశిక్షణతో కూడిన విద్య అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయం నూతన భవనాన్ని షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈ.డి. చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్, 13వ పటాలము కమాండెంట్, సమన్వయకర్త శ్రీధర్, తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య జరుగుతుందని తెలిపారు. ఏ పాఠశాలలో అయినా ఒక ప్రాంతం నుండి వచ్చిన విద్యార్థులు మాత్రమే చదువుకుంటారని, కేంద్రీయ



విద్యాలయాలు, నవోదయ పాఠశాలలలో వివిధ ప్రాంతాలు, వివిధ భాషలు, వివిధ సంస్కృతల నుండి వచ్చిన విద్యార్థులు ఒకే వేదికగా విద్య అభ్యసించడం జరుగుతుందని తెలిపారు. మాతృభాషతోపాటు ఆంగ్లం, హిందీ భాషలు విద్యార్థులకు అందించబడతాయని, కేంద్రీయ విద్యాలయాలలో విద్య అభ్యసించిన వారు ఉన్నత విద్య అనంతరం జాబ్ మార్కెట్ లో రాణించేందుకు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకుంటారని, ఎలాంటి సమస్యలు ఎదురైనా తాము నేర్చుకున్న క్రమశిక్షణతో పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతారని తెలిపారు. ( మిగితా..2లో )

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

## ముందస్తు జాగ్రత్తలు

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే 3 నెలల కాలంలో రీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, జిల్లాలో భారీ వర్షాలు కురిసినందున రీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం ఆసుపత్రులలో ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లా పర్యటనలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు సందర్శించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రులలో జ్వర వార్డులలో కల్పిస్తున్న సౌకర్యాలు,




అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది, మందుల వివరాలు, ల్యాబ్ లలో చేస్తున్న వైద్య పరీక్షలు, వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న పౌష్టిక ఆహారం, పారిశుధ్య నిర్వహణ, ఇప్పటి వరకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి నమోదైన కేసుల వివరాలు, జ్వర పీడితులకు అందిస్తున్న వైద్య చికిత్సల వివరాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు చెన్న కేశవ్, వైద్యులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

**- జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య.**

**బెల్లంపల్లి, జూలై 29, సూర్య మేజర్ న్యూస్:**

రైతులు చేసుకున్న భూ భారతి దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్ లో ఉంచొద్దని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ పీ. చంద్రయ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం బెల్లంపల్లి పట్టణంలోని తహసిల్దార్‌కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను భూ భారతి దరఖాస్తులను, ధ్రువపత్రాల జారీ వివరాలను తాసిల్దార్ కృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత పట్టణంలోని పౌర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాముల వద్దకు వెళ్ళి స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. అంతకు ముందు ఆయన పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ సీవోఈ కళాశాలను తనకి చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, సీజనల్ వ్యాధులు, డయేరియా ప్రబలే అవకాశాలు ఉన్నందున పాఠశాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఇన్చార్జి ప్రిన్సిపల్ ను ఆకిడి విజయ సాగర్ ను ఆదేశించారు. ఆయన వెంట బెల్లంపల్లి ఆర్డీవో బి.హరికృష్ణ ,తహసిల్దార్ కృష్ణ తదితరులు ఉన్నారు.




### ఆహార భద్రత కార్డులను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్

## రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ ( జైనథ్ ),సూర్య మేజర్ న్యూస్ :**

జైనథ్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నారాయణ కళ్యాణ మండపంలో మంగళవారం జైనథ్, బోరజ్, సాత్నాల, బేల మండలాల లబ్ధిదారులకు రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఎమ్మెల్యే పాయల్ శంకర్ లబ్ధిదారులకు రేషన్ కార్డుల పత్రాలను అందజేశారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, రేషన్ కార్డులు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను అందజేస్తుందని అన్నారు. రేషన్ కార్డులలో పేర్లు నమోదు కాని వారు నమోదు చేసుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలని, ప్రభుత్వాలు అందించే పథకాలు లబ్ది దారులకు అందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి,గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, ఆర్డీఓ స్రవంతి, సివిల్ సప్లయ్ అధికారి వాజిద్, మండలాల తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## పశు వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ (జైనథ్), సూర్య మేజర్ న్యూస్**

మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా జైనథ్ మండలం లోని పశు వైద్య శాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీ సందర్భంగా కార్యాలయ పనితీరును, పశువైద్యుల హాజరు, ఔషధాల నిల్వలు, రోగ నిర్ధారణ పరికరాల వినియోగం, రికార్డ్ నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,"ప్రభుత్వ పశువైద్య సేవలు సమర్థంగా, సమయానికి అందుబాటులో ఉండాలని రైతులుపశు పాలకు లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని అన్నారు.ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పశువులకు ఎలా వైద్యం చేస్తున్నారో ప్రత్యక్షంగా పరిశీలించి,మండల పశుసంపద వివరాలు,మందుల కొరత ఉందని తెలుసుకొని మందుల కొరత లేకుండ వారంరోజుల్లో అందుబాటులో ఉంచుతామని రైతులకు తెలిపారు.ఈ సందర్భంగా పశు వైద్యశాల అధికారుల పనితీరును అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్ డి ఒ స్రవంతి, అసిస్టెంట్ కంపౌండర్ ముజిద్ ఖాన్ , ఎంపీవో మహేష్, తదితరులు పాల్గొన్నారు.



### అంతరాష్ట్ర ఆయుర్వేదిక్

## నకిలీ ముఠా అరెస్ట్

**- 8 కేసులు నమోదు, 8 మంది అరెస్టు**
**- ఆరు ద్విచక్ర వాహనాలు, 15 మొబైల్ ఫోన్స్, సిమ్ కార్డులు, నకిలీ ఆయుర్వేదిక్ మందులు స్వాధీనం - పదివేల నగదు స్వాధీనం, బ్యాంకు నందు 23 వేల నగదు సీజ్ - ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

పట్టణంలోని సాయి ఆయుర్వేదిక్ మందుల




దుకాణం పేరుతో ముఠా నిర్వహిస్తున్న అక్రమాలపై ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ పత్రికా సమావేశంలో వివరాలను వెల్లడించారు.ఈ ముఠా సభ్యులు విడివిడిగా విడిపోయి కొందరు ఆదిలాబాద్ పట్టణంలో మరియు పలు ప్రభుత్వ మరియు ప్రైవేటు హాస్పిటల్స్ వద్ద, పలు సూపర్ మార్కెట్ల వద్ద అనారోగ్యంతో ఉన్న బాధితులను అందులో ముఖ్యంగా చిన్నపిల్లలను మహిళలను మరియు వృద్ధులను గ్రహించి వారిని సంప్రదించి తమ కుటుంబ సభ్యులకు సైతం ఇదేవిధంగా సమస్య ఉండేదని దానికి ఒక ఆయుర్వేద బాబా ద్వారా తమ సమస్యలకు అనారోగ్య సమస్యలు నయం అయి, పూర్తి అయోగ్యంగా పరిష్కారం లభించిందని తెలిపి వారి వద్దనుండి మొబైల్ నెంబర్లను సేకరించి కీలక ప్రధాన సూత్రధారి అయిన ఏ 1కుమార్ బాబాకు అందజేయడం జరుగుతుందని ( మిగితా...2లో )

## ఆసుపత్రికి వచ్చే ప్రజలకు

### మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

2లో



సూర్య www.suryaa.com

బుధవారం 30 జులై 2025

## కేంద్రీయ విద్యాలయాల ద్వారా జ్ఞానం, క్రమశిక్షణతో కూడిన విద్య- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మొదటి పేజీ తరువాయి...**

ఏకాగ్రతతో కష్టపడే వారు విజయం సాధిస్తారని, తమ జీవితంలో ఎదుర్కొనే హెచ్చుతగ్గులను అధిగమించి ఉన్నత స్థానాలకు ఎదుగుతారని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, కళలు ఇతర ఆసక్తి ఉన్న రంగాలలో రాణించాలని, సమాజాన్ని తెలుసుకోవాలని తెలిపారు. సోషల్ స్కిల్స్ తప్పనిసరిగా తెలుసుకోవాలని, తల్లిదండ్రులు, వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, పిల్లలతో ప్రవర్తించే విధానంలో తమ సంస్కారం కనిపిస్తుందని తెలిపారు. సత్ప్రవర్తన, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, పోటీ తత్వానికి పాఠశాల పునాది వంటిదని తెలిపారు. జిల్లాలోని కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసించి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలిపారు. అనంతరం విద్యాలయం ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి లోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మండల కేంద్రంలోని నర్మద ఫర్టిలైజర్ దుకాణాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి లతో కలిసి సందర్శించి స్టాకు నిల్వలు, రిజిస్టర్లు, రసీదు పుస్తకాలను పరిశీలించారు. జిల్లాలో వ్యవసాయ సాగుకు సరిపడా ఎరువులు, విత్తనాలు, యూరియా సమృద్ధిగా ఉన్నాయని, రైతులకు విక్రయించే వాటి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయడంతో పాటు తప్పనిసరిగా రసీదు జారీ చేయాలని, దుకాణం ఎదుట ధరల పట్టిక, స్టాకు నిల్వల వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలని, నకిలీ, నిషేధిత అంశాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పద్దనపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులకు వ్యవసాయ సాగుకు అవసరమైన మెలకువలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, భవిత కేంద్రం, సబ్బెపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, హాజరు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, శుద్ధమైన త్రాగునీటిని ఇవ్వాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రపరచుకోవడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యా బోధన అంశంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.



అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం అయినందున పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు నీటి నిల్వలను తొలగించడంతో పాటు ఆయిల్ బాల్స్, బయోటెక్ స్ప్రే పిచికారి చేయాలని తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటి సంరక్షించాలని, ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో భాగంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తూ అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేయాలని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళ శక్తి భవన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపడుతుందని, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక చేయూతనందించి అభివృద్ధి చెందే విధంగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి వచ్చే ప్రజలకు

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**కెరెమెరి,జులై 29, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ ఆసుపత్రులకు వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు.



మంగళవారం జిల్లాలోని కెరమెరి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, అవుట్ పేషంట్ సేవలు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించి జ్వర పీడితుల వివరాలను తెలుసుకొని వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కాకూడదని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందుల నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని జమొరిడి గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యాలయ పరిసరాలు, మెను పట్టిక, వంటశాల, భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక చర్యలు చేపడుతుందని, ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని తెలిపారు. కాలం చెల్లిన వస్తువులను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్నానపు గదులు, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని, విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలలో నీరు నిలువ లేకుండా చూడాలని, దోమల అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గణితం, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టులపై విద్యార్థులను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, వైద్యులు, తహసిల్దార్ భూమేశ్వర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అంజద్ పాషా, మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బావిలో పడ్డ శునకాన్ని రక్షించిన

# అగ్నిమాపక సిబ్బంది

**కాసిపేట జులై 29 సూర్య మేజర్ న్యూస్**

కాసిపేట మండలంలోని కోమటి చేను గ్రామం సమీపంలో కాసిపేట 2 ఇంక్లైన్ గనికి వెళ్లేదారిలో పాడుబడ్డ బావిలో పడిన శునకాన్ని విపత్తుల శాఖ వారు కాపాడారు. వారం రోజుల క్రితం ప్రమాదవశత్తు బావిలో పడిన శునకాన్ని అటుగా వెళుతున్న యువకులు గమనించి విపత్తుల శాఖకు సమాచారం అందించారు. విపత్తుల శాఖ వారు స్థానిక యువకులతో కలిసి బావిలో పడ్డ శునకాన్ని బయటకు తీసి దాన్ని కాపాడారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఓ ఆర్ సత్యనారాయణ, ఫైర్ మ్యాన్ రవికుమార్, ప్రభాకర్, శ్రీను, సుధాకర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక యువకులను పలువురు అభినందించారు.



### అంతరాష్ట్ర ఆయుర్వేదిక్

# నకిలీ ముఠా అరెస్ట్

### - 8 కేసులు నమోదు, 8 మంది అరెస్టు- ఆరు ద్విచక్ర వాహనాలు, 15 మొబైల్ ఫోన్స్, సిమ్ కార్డులు, నకిలీ ఆయుర్వేదిక్ మందులు స్వాధీనం- పదివేల నగదు స్వాధీనం, బ్యాంకు నందు 23 వేల నగదు సీజ్ - ఎస్పీ అఖిల్ మహాజన్

**మొదటి పేజీ తరువాయి...**

తదుపరి సాయంత్రం ముఠాలో కీలక సభ్యుడైన కుమార్ బాబా వారికి ఫోన్ ద్వారా సంప్రదించి తాను ఒక ఆయుర్వేద వైద్యుడనని వివరాలను, సమస్యలను తెలుసుకుని ఈ సమస్యలకు పరిష్కారం ఉందని నమ్మబలికి, తన యొక్క కుమారులను పంపిస్తానని చెప్పి ఆదిలాబాద్ లో ఉన్న తన ముఠా సభ్యులను వారి ఇంటికి పంపి ఇంట్లో ఉన్న వస్తువులతో ఒక మిశ్రమాన్ని తయారుచేసి ఈ మిశ్రమానికి మావల పోలీస్ స్టేషన్ పరిధిలో బాబా కు సంబంధించిన ఒక ఆయుర్వేదిక్ దుకాణంలో లభిస్తాయని నమ్మబలికి, వారిని వెంట పట్టుకొని ఐదు గ్రాములు, 10 గ్రాములు సంబంధించిన నకిలీ మూలికలను, ఒక గ్రాము 5000 – 10000 చొప్పున బాధితులకు అమ్మి, లక్షలలో దండుకోవడం మోసం చేయడం



వీరి ముఠా చేస్తున్న అక్రమ దందా. వీరందరూ కర్ణాటక రాష్ట్రానికి చెందినవారుగా తెలిపారు. వీరందరూ ఇదివరకే సూర్యాపేట, ఖమ్మం, సిద్దిపేట జిల్లాలలో ఇలాంటి మోసాలకు పాల్పడి ఇప్పుడు ఆదిలాబాద్ జిల్లాలో మోసాలకు పాల్పడడం జరిగిందని తెలిపారు. తదుపరి ఇతర జిల్లాకు వెళ్లకుండా జిల్లా పోలీసు యంత్రాంగం అడ్డగించి వారి అక్రమాలను బట్టబయలు చేసిందని తెలిపారు. ప్రజలు ఎలాంటి బాబాలను మూఢనమ్మకాలను నమ్మకుండా గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులను సంప్రదించి సరైన వైద్య చికిత్సను తీసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన ఆయుర్వేదిక్ వైద్యం ద్వారా చికిత్సను పొందాలని ఇలాంటి మందులను వాడటం వల్ల తమ ఆరోగ్యం మరింత చెడిపోయి అనారోగ్య బారిన పడతారని విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఈ ముఠా సభ్యులపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఐదు కేసులు, టూ టౌన్ లో ఒకటి, మావలాలో రెండు కేసులు నమోదు అయ్యాయని, తెలిపారు వీరందరిపై బిఎన్ఎస్ 318(4), 316 తో కేసు నమోదు అయిందని తెలిపారు. ఈ ముఠా సభ్యులను ఈరోజు ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో 8 మందిని పట్టుకొని అరెస్టు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ వివరించారు. ఈ ముఠా సభ్యులలో కీలక నిందితుడి పట్టుకోవడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కీలక నిందితుడు వీరందరికీ నకిలీ పేర్లతో మొబైల్ ఫోన్ లను మరియు సిమ్ కార్డులను అందజేయడం జరుగుతుందని, తదుపరి ఈ మొబైల్ ఫోన్ లను సిమ్ములను నాశనం చేయడం జరుగుతుందని తెలిపారు. కలిసికట్టుగా ప్రజలను మోసగించి సంపాదించిన డబ్బులను వారందరూ పంచుకునేవారుగా తెలియజేశారు. ఈ ముఠా సభ్యులను చాకచక్యంగా పట్టుకున్న ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, ఎస్సై నాగనాథ్ లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ పత్రికా సమావేశంలో ఆదిలాబాద్ డిఎస్పిఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్ రావు, కె స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాన్ని సందర్శించుకున్న మాజీ ఎంపీ రాజ్ గోండ్ -సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు

**నేరడిగొండ జూలై 29 సూర్య మేజర్ న్యూస్.:** తెలంగాణలో రాష్ట్రంలో ప్రసిద్దిగాంచిన కేస్లాపూర్ గ్రామంలో ఉన్న అతి పురాతన నాగోబా ఆలయాన్ని మాజీ ఎంపీ సోయం బాపూరావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



సోయం బాపూరావు రాజ్ గోండ్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు గా ఎన్నిక తర్వాత మొదటిసారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు సోయం బాపూరావు ఘన స్వాగతం పలికి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సోయం బాపూరావు కు శాలువాతో ఘనంగా సన్మానం సన్మానించారు. నాగోబా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. సోయం బాపూరావు వెంబడి జిల్లా రాజ్ గోండ్ అధ్యక్షులు పందెం శంకర్, మెస్రం వెంకట్రావు, మెస్రం నాగనాథ్, శేఖర్ బాబు తదితరులు ఉన్నారు.

### నాగుల పంచమి సందర్భంగా పలు ఆలయాలను

## దర్శించుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ జూలై 29 సూర్య మేజర్ న్యూస్**

నాగులపంచు సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ



గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గుడిహత్నూర్ మండలంలోని మచ్చాపూర్ గ్రామంలో ఉన్న మూర్తి రాములు శివాలయాన్ని సందర్శించ పూజలు చేశారు. మండలంలోని కుంటాల వెళ్లే రోడ్డుకు దగ్గర ఉన్న శివాలయం సందర్శించి పూజలు చేశారు అనంతరం బోథ్ అక్షరం లో ఉన్న నాగుల పంచమి సందర్భంగా పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు.

## మూర్తి రాములను దర్శించుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**గుడిహత్నూర్ జూలై 29 సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని మచ్చాపూర్ గ్రామంలో గల మూర్తి రాములు ఆలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాగుల పంచమి సందర్భంగా దర్శించుకున్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు మూర్తి రాములు ఆశీస్సులతో ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. మూర్తి రాములు ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తిరుమల గౌడ్, పవర్ రవి నాయక్,రాథోడ్ ప్రతాప్, ఆడే గణవంత్ , మచ్చాపూర్ మాజీ సర్పంచ్ ఆడే సంగీత, జాదవ్ రమేష్, ముండే సంజు, ముండే రాహుల్, దోమకొండ సుధాకర్, సిద్ధార్థ ససానే, గిత్తే గజానంద్, జాదవ్ భీం రావ్,తెలంగే మాధవ్, రంగు శ్రీనివాస్ గౌడ్, తోగరే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## జైపూర్ పీ హెచ్ సీ పై ఆకస్మిక తనిఖీ-వైద్య సేవలపై అధికారుల సమీక్ష

**జైపూర్, జూలై 29, సూర్య మేజర్ న్యూస్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజు ఆదేశాల మేరకు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అప్పల ప్రసాద్ జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం (పీహెచ్సీ) ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యులు డాక్టర్ అశోక్, డాక్టర్ స్పందన విధుల్లో అందుబాటులో ఉండగా, ఇతర వైద్య సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్శనలో, ఉపకేంద్రాల పరిధిలో ఆశా వర్కర్లు ఇంటింటి తిరిగి ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఈ మండలంలో డెంగ్యూ లేదా మలేరియా కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. డాక్టర్ అప్పల ప్రసాద్ మాట్లాడుతూ, రోగులతో సౌహార్దంగా వ్యవహరించాలి, అవసరమైన మందులను ముందస్తుగా నిల్వ ఉంచాలి, ఉపకేంద్ర సిబ్బందితో రోజువారీ సమీక్షలు నిర్వహించాలి, ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి,పాము, కుక్క కాటుకి సంబంధించి మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల కోసం పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాలు, యువతా సంఘాలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ సంపత్ పాల్గొన్నారు. అనంతరం, జైపూర్లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. పాఠశాలలో 480 మంది విద్యార్థులు చదువుతుండగా, స్టాఫ్ నర్స్ మణిదీపిక ద్వారా వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. డైనింగ్ హాల్ వద్ద శుభ్రత పాటించాలని, కోడిగుడ్ల పొట్టు శుభ్రంగా తీయాలని, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్శనలో మండల ప్రజాపరిషత్ అధికారి సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు కూడా పాల్గొన్నారు.



## సక్రమంగా విధులకు హాజరు కావాలి

**రెబ్బెన, జూలై 29, సూర్య మేజర్ న్యూస్:** సింగరేణి ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరైతే సంస్థ తో పాటు వారి కుటుంబానికి ఆర్థిక, సామాజిక తోడ్పాటునందించిన వారు అవుతారని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం గోలేటిలోని సిఈఆర్ క్లబ్ లో గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ.. ఒకప్పుడు భూగర్భ గనుల్లో పనిచేయడానికి ఉద్యోగులు ఇబ్బందులు పడేవారని కాని నేడు యాంత్రీకరణ మూలంగా ఆ పరిస్థితులు లేవన్నారు. బెల్లంపల్లి ఏరియాలో భూగర్భ గనులు లేవన్నారు. ఒకేఒక ఉపరితల గని, ఉండగా అన్ని ఉపరితల పనులు ఐనప్పటికీ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్నారు. ఇప్పటికైనా గైర్హాజరు అవుతున్న ఉద్యోగులు బెల్లంపల్లి ఏరియా లో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగుల ఆర్థిక, కుటుంబ పరిస్థితులు, గైర్హాజరు కు గల కారణాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పిల్లల ఉన్నత చదువులు, కుటుంబం మంచి స్థితిలో ఉండాలంటే గైర్హాజరు కాకుండా ఉండాలని సూచించారు. ఆరోగ్య సమస్యలుంటే ఆసుపత్రులకు వెళ్లి వైద్యుల సూచనలు పాటించి త్వరగా కోలుకునేందుకు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. 31మంది గైర్హాజరు ఉద్యోగులు, వారి కుటుంబ కౌన్సిలింగ్కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఖైరిగురు ప్రాజెక్ట్ అధికారి ఎం నరేందర్, ఎస్ఓ టు జీఎం రాజమల్లు, డివైపిఎం రాజేశ్వర్ రావు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి రజినికుమార్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు-రఘునాథ్ వెరబెల్లి

**నస్పూర్, జూలై 29, సూర్య మేజర్ న్యూస్:** ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, మంగళవారం నస్పూర్ లోని తీగల పహాడ్ ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు, స్కూల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు, దీటుగా రాణించాలని, అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పీఎం శ్రీ పథకం కింద దేశ వ్యాప్తంగా, అన్ని ప్రభుత్వ పాఠశాలలకు, వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి, ప్రభుత్వ పాఠశాలలను స్మార్ట్ స్కూల్ లాగా, చేయాలని అన్నారు. ప్రతి పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చేసి, పేద ప్రజలకు, నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నారని అన్నారు . దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్, లా విద్యా సంస్థలను, వేల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పేద ప్రజలకు, మంచి విద్యను అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్రం రమేష్, కట్టూరి సతీష్ కుమార్, గాజుల ముఖేష్ గౌడ్, మిట్టపల్లి మొగిలి, కుర్రె చక్రి, కాదాసు భీమయ్య, పలువురు బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## భక్తి శ్రద్ధలతో నాగ దేవతకు అభిషేకాలు

**మందమర్రి, జూలై 29, సూర్య మేజర్ న్యూస్**

శ్రావణ మాసంలో వచ్చిన తొలి పండగ కావడంతో ప్రకృతిలో భాగమైన పాములను సైతం గౌరవించాలనే ఉద్దేశ్యంతో భక్తులు నాగ దేవతకు అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో నాగ పంచమి పండుగను ఘనంగా నిర్వహించారు. మార్కెట్ ఏరియాలోని వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు పట్టణ పరిధిలోని పలు ఆలయాల్లో నాగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం వేకువ జామునుండే మహిళలు దేవాలయాల్లో బారులు తీరి పరమ శివుని ఆశీస్సులతో సకల శుభాలు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లోని పాము పుట్టల్లో నాగేంద్ర స్వామికి, నాగ దేవతకు పండ్లు, గుడ్లు, పసుపు, కుంకుమ, పూలు సమర్పించి అభిషేకాలు నిర్వహించారు. సర్ప దోషం ఉన్నవాళ్లు విశేష ఫల ప్రదమైన ఈ రోజు నాగదేవతలకు పూజ చేస్తే సకల దోషాలు తొలగిపోయి, అదృష్టం కలిసి వస్తుందని భక్తుల నమ్మకం.



# కొత్త రేషన్ కార్డులతో ప్రభుత్వ పథకాలు మరింత మెరుగ్గా అమలవుతాయి

## -జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ,జులై28,సూర్య మేజర్ న్యూస్ :**
ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాలన్నీ మరింత మెరుగ్గా ప్రజలకు చేరుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం మామడ మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన రేషన్ కార్డులను నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చాలా ఏళ్ల తర్వాత నూతన రేషన్ కార్డులు లబ్ధిదారులకు చేరడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం అర్హులైన వారందరికీ నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తుందని అన్నారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.



ఇప్పటికినీ ఎవరైనా నూతన రేషన్ కార్డుల కొరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మామడ మండలానికి సంబంధించి 660 నూతన రేషన్ కార్డులు మంజూరు కాగా, 920 రేషన్ కార్డులలో కుటుంబసభ్యుల పేర్లు అదనంగా చేర్చడం జరిగినట్లు తెలిపారు. రేషన్ కార్డులు మంజూరైన ప్రజలందరికీ వారి గ్రామపంచాయతీలలో లబ్ధిదారులకు అధికారులు అందజేస్తారని అన్నారు. నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, నూతన రేషన్ కార్డుల పంపిణీ తో మరింత మంది ప్రజలు ప్రభుత్వ పథకాలను పొందగలుగుతారని అన్నారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయని అన్నారు. పేద ప్రజలకు రేషన్ బియ్యాన్ని అందిస్తున్నందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఆదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, తహసిల్దార్ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, రేషన్ కార్డుల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# నాగోబాను దర్శించుకున్న

## టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

**ఉట్నూర్ ,సూర్య మేజర్ న్యూస్ :**
ఇంద్రవెల్లి ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోభ ఆలయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క దర్శించుకున్నారు.మంగళవారం



నాగుల పంచమి సందర్బంగా కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. నాగోబాకు మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం మెస్రం వంశీయులతో సమావేశమై ఆలయ అభివృద్ధిపై చర్చించారు.ఆదివాసుల సమస్యలు పరిష్కరించే దిశగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, నాగోబా జాతర అభివృద్ధి కోసం పాటుపడతామన్నారు.సుగుణక్క వెంట ఆలయ చైర్మన్ ఆనంద్ రావు పాటేల్,మెస్రం వెంకట్ రావు పటేల్,కోసేరావు పటేల్,సంతోష్,రాంకిషన్,వినోద్ తదితరులు ఉన్నారు.

## మహిళ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్,జులై 29 సూర్య మేజర్ న్యూస్**
నేరాల అదుపులకు పటిష్టమైన చర్యలు చేపడుతూ గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఈరోజు ఆదిలాబాద్ పట్టణంలోని ఉమెన్ పోలీస్ స్టేషన్ మరియు ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ సిబ్బందిని ఉద్దేశించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్కు వచ్చి బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించే దిశగా త్వరితగతిన సిబ్బందిని కేటాయించి బాధితులకు తగ న్యాయం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతో ఉంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణ ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా మహిళల పట్ల వారి ఫిర్యాదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మహిళా ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే విధంగా సున్నితమైన అంశాలను జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఉండాలని సూచించారు. మహిళల పట్ల ప్రత్యేకంగా మహిళా పోలీస్ స్టేషన్ ఉన్నందున ఎలాంటి భార్యాభర్తల సమస్యలు ఉన్న వారిని పరిష్కరించే దిశగా బాధితులకు న్యాయం చేసే దిశగా తగు చర్యలను చేపట్టాలన్నారు. త్వరలో రానున్న ఎన్నికలకు ప్రతి ఒక్కరు పూర్తి సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి వార్డుకు పోలీసు అధికారిని కేటాయించి విపియో విధానాన్ని అమలు చేయాలన్నారు. ముఖ్యంగా పట్టణంలో ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా గస్తీ నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్లో ఉన్న బ్లూ కోర్ట్, డయల్ హండ్రెడ్, స్టేషన్ రైటర్స్, సెక్షన్ ఇంచార్జ్, ఫైవ్ ఎస్, పెట్రో కార్, రిసెప్షన్ లాంటి వర్టికల్స్ను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. రాత్రి సమయాలలో గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఆదిలాబాద్ పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో గంజాయి, మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి అన్నారు. రాత్రి సమయాలలో మరింత పటిష్టంగా గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాల అదుపునకు కృషి చేయాలన్నారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు. ముఖ్యంగా కేసుల దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సరైన సమయంలో దర్యాప్తు చేసి కోర్టుల నందు చార్జిషీటు దాఖలు చేసినప్పుడు బాధితులకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణాకర్ రావు, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ చైర్మన్ రౌత్ సత్తయ్య పటేల్ కు ఘనంగా సన్మానం

**కాసిపేట, జూలై 29, సూర్య,మేజర్, న్యూస్ :**
కాసిపేట మండలంలోని సోమగూడెం (కే)లో సోమవారం మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు అట్టపల్లి శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో ఆత్మ చైర్మన్ రౌత్ సత్తయ్య పటేల్ కు ఘనంగా సన్మానం చేశారు. మున్నూరు కాపు సంఘం సీనియర్ నేత రౌత్ సత్తయ్య పటేల్ ఇటీవల ఆత్మ చైర్మన్ గా నియామకం కావడంతో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు అట్టేపల్లి శ్రీనివాస్ పటేల్, ప్రధాన కార్యదర్శి ఇంగు నారాయణ పటేల్, జిల్లా యూత్ అధ్యక్షుడు తేంద్ర శ్యాం పటేల్, జిల్లా అధికార ప్రతినిధి సిద్ధం తిరుపతి పటేల్, గౌరవాధ్యక్షులు సిద్ధం బాపు పటేల్, ఉపాధ్యాక్షులు సిద్ధం రాములు పటేల్, మడిపల్లి తిరుపతి పటేల్, సలహాదారులు చింతల భీమయ్య పటేల్, గ్రామ అధ్యక్షులు పానగంటి తిరుపతి పటేల్, గుర్రాల వేణు పటేల్, నామసాని రాజు పటేల్, అడప పాపయ్య పటేల్, ఉస్కమల్ల పవణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### - స్పెషల్ ఆఫీసర్ జీవ రత్నం

**ఖానాపూర్ టౌన్,జులై 29,సూర్య మేజర్ న్యూస్ :**
ఖానాపూర్ మండలంలోని దిలావర్పూర్ గ్రామంలో డ్రైడే ప్రోగ్రాం ను ఖానాపూర్ స్పెషల్ ఆఫీసర్ జీవ రత్నం సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలలో డ్రైడే ప్రోగ్రాం నిర్వహించి, గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.




అనంతరం మురికి కాలువలు, గ్రామంలోని రోడ్లను పరిశీలించరు. అనంతరం వర్షాకాలంలో ప్రజలు రోగుల భారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి, ఆశ వర్కర్ లకు, అంగన్వాడీ టీచర్లకు పలు సూచనలు చేసి, పంచాయతి రికార్డులను పరిశీలించారు. ఇందులో ఎంపిడిఓ సునీత, ఎంపిఓ రత్నకర్, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ కుటుంబానికి ప్రమాద భీమా చెక్క అందించిన

# ఎమ్మెల్యే పాయల శంకర్

**ఆదిలాబాద్,జులై29, సూర్య మేజర్ న్యూస్ :**
ఇటీవల పాము కాటుతో మృతి చెందిన ప్రైవేట్ వాహన డ్రైవర్ పెద్దింటి ప్రభాకర్ కుటుంబానికి మంజూరైన ప్రమాద భీమా చెక్కును ఎమ్మెల్యే పాయల శంకర్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.స్థానిక బస్టాండ్ వద్ద ప్రైవేట్ వాహన డ్రైవర్ల సంఘం భవనం వద్దా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల శంకర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు ఏమైనా ఘటన జరిగితే డ్రైవర్ల కుటుంబానికి బాసటగా కేంద్ర ప్రభుత్వ భీమ పథకాలను తీసుకువచ్చిందని తెలిపారు.గత రెండేళ్ల క్రితం ఆదిలాబాద్‌లోని డ్రైవర్ల సంఘం సభ్యులకు తనవంతుగా పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోస్ట్ ఆఫీస్ లో ప్రమాద బీమా చేయించడం జరిగిందన్నారు.ఇటీవల డ్రైవర్ పెద్దింటి ప్రభాకర్ పాముకాటులో మృతి చెందగా...ఆయనకు మంజూరైన 10 లక్షల చెక్కును అందజేయడం జరిగిందన్నారు.అదేవిధంగా గ్రామాలు, పట్టణాల్లో ఇల్లు లేని డ్రైవర్లకు ఇంటి స్థలాలందే విధంగా కృషి చేస్తానన్నారు. డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో డ్రైవర్ సంఘ నాయకులు,బీజేపీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులకు రెయిన్ కోట్లు పంపిన చేసిన వాల్గోట్ కిషన్

**ఖానాపూర్, సూర్య మేజర్ న్యూస్ :**
ఖానాపూర్ మున్సిపాలిటీ లో పనిచేస్తున్న 20 మంది కార్మికులకు ఖానాపూర్ పట్టణం నకు చెందిన ప్రభుత్వ టీచర్ వాల్గోట్ కిషన్ మంగళవారం నాడు రేన్



కొట్ లను అందజేశారు. అనంతరం కిషన్ మాట్లాడుతూ ప్రతి రోజు తెల్లవారక ముందే ఖానాపూర్ పట్టణం ను శుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. కావున వీరు చేస్తున్న సేవలకు, వర్షాలు నుండి తడవకుండా ఉండడానికి కార్మికులకు రేన్ కోట్ లు అందజేసానని వాల్గొట్ కిషన్ తెలిపారు. ఈ సందర్బంగా కార్మికులు కిషన్ కు ధన్యవాదాలు తెలిపారు.మున్సిపల్ కమిషనర్‌తో పాటు పలువురు వాల్గోట్ కిషన్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ కమీషనర్ సుందర్ సింగ్,ఖానాపూర్ మున్సిపాలిటీ సిబ్బంది సురేందర్, ఫిరోజ్, శంకర్, చేతన్ మరియు కార్మికులు పాల్గొన్నారు.

## సిర్పూర్ టీలో ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం

**సిర్పూర్ (టి) సూర్య మేజర్ న్యూస్:**
సిర్పూర్ మండల కేంద్రంలో మంగళ వారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా సిర్పూర్ టి మండల ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం నుండి బస్ స్టాప్ చౌరస్తా వరకు జిల్లా పరిషత్ పాఠశాల పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం జూలై 29న ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారని ఇన్చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పులుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత పులులు అంతరించిపోతున్న పులుల జాతి, వాటిని రక్షించడం మనందరి కర్తవ్యం. పులుల సంరక్షణ ద్వారా పర్యావరణ వ్యవస్థ సమతుల్యతను కాపాడవచ్చు మరియు భవిష్యత్ తరాలకు వాటిని అందించవచ్చు.పులులను రక్షించడం అంటే మన ప్రకృతిని, మన పర్యావరణాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ రేంజర్ శశిధర్, ఎఫెసోలు తులసీదాస్, తిరుపతి, అతరుద్దీన్, ప్రసాద్ రావు, మోతిలాల్,వందన,ఎఫ్బి వోలు లక్ష్మి,రవినా జాదవ్, శ్రీదేవి, అనూష, సంతోష్, మల్లికార్జున్, అరవింద్, అరుణ్ రెడ్డి, ఫారెస్ట్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.



# అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అధునాతన సాంకేతిక విద్య

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జులై 29,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు అడ్వాన్స్ టెక్నాలజీ హబ్‌లుగా మారి అత్యాధునిక మౌలిక వసతులతో అధునాతన సాంకేతిక విద్య అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ వై. రమేష్, ఇతర అధికారులతో కలిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా నైపుణ్యతతో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయి ల్యాబ్ లు, టాటా టెక్నాలజీ సహకారం, ప్రముఖ ఇండస్ట్రీలో భగస్వామ్యంతో యువత భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. నిష్ణాతులైన ట్రైనర్ల పర్యవేక్షణలో ఇండస్ట్రీ 4.0 మిషనరీ పై రియల్ టైం ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 65 అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లలో 11 వేల 132 సీట్లు అందుబాటులో ఉన్నాయని, వచ్చే విద్యా సంవత్సరంలో మరో 46 సెంటర్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని, యువత భవిష్యత్తు కోసం 5 వేలకోట్ల రూపాయలతో రాష్ట్రవ్యాప్తంగా 111 అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ టి. సుజాత, శిక్షణ అధికారులు దత్తాత్రి, శ్రీధర్, మనోహర్, సీనియర్ సహాయకులు రామస్వామి, ఎ. టి. ఓ. సంధ్య తదితరులు పాల్గొన్నారు.

### టైగర్ జోను రద్దు చేయాలని

## ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేత

**జన్నారం, జూలై 29, సూర్య మేజర్ న్యూస్ :**

కవ్వాల్ టైగర్ జోన్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జన్నారం మండల




కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యంలో గల టైగర్ జోన్ అంశాలను ఎత్తివేయాలని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద గత 14 రోజులుగా రిలే దీక్ష చేపట్టిన శ్రీరాముల భూమాచారి, అజ్మీర బద్రీ నాయక్ ల వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. అనంతరం ఎమ్మార్వో రాజ మనోహర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అందజేసిన వారిలో మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య, కో కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కదార్ల నరసయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, గుడ్ల రాజన్న, సంద గోపాల్, కోడి జుట్టు రాజన్న, పిల్లి మల్లయ్య, రాగుల శంకర్, కనికరపు అశోక్, ఐలవేణి రవి తదితరులున్నారు.

## ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావాలి

**బెల్లంపల్లి, జూలై 29, సూర్య మేజర్ న్యూస్:**

సింగరేణి ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరైతే సంస్థ తో పాటు వారి కుటుంబానికి ఆర్థిక, సామాజిక తోడ్పాటునందించిన వారు అవుతారని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం గోలేటిలోని సిఈఆర్ క్లబ్‌లో గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్



నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు భూగర్భ గనుల్లో పనిచేయడానికి ఉద్యోగులు ఇబ్బందులు పడేవారని కాని నేడు యాంత్రీకరణ మూలంగా ఆ పరిస్థితులు లేవన్నారు. బెల్లంపల్లి ఏరియాలో భూగర్బ గనులు లేవన్నారు. ఒకేఒక ఉపరితల గని,ఉండగా అన్ని ఉపరితల పనులు ఐనప్పటికీ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్నారు. ఇప్పటికైనా గైర్హాజరు అవుతున్న ఉద్యోగులు బెల్లంపల్లి ఏరియాలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగుల ఆర్థిక,కుటుంబ పరిస్థితులు, గైర్హాజరు కు గల కారణాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పిల్లల ఉన్నత చదువులు, కుటుంబం మంచి స్థితిలో ఉండాలంటే గైర్హాజరు కాకుండా ఉండాలని సూచించారు. ఆరోగ్య సమస్యలుంటే ఆసుపత్రులకు వెళ్లి వైద్యుల సూచనలు పాటించి త్వరగా కోలుకునేందుకు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. 31 మంది గైర్హాజరు ఉద్యోగులు, వారి కుటుంబ కౌన్సిలింగ్ కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఖైరిగుర ప్రాజెక్ట్ అధికారి ఎం. నరేందర్, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, డివై పిఎం ఎస్వి రాజేశ్వర్ రావు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి రజిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పులుల దినోత్సవ వేడుకలు

**చింతలమానేపల్లి, జూలై 29, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని జెడ్పి హెచ్ ఎస్ ప్రభుత్వ పాఠశాలలో అటవీశాఖ అధికారులు అంతర్జాతీయ పులుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పాఠశాలలో మంగళవారం పులుల దినోత్సవ వేడుకల సందర్భంగా పిల్లలకు వ్యాసరచన, బొమ్మల పోటీలు నిర్వహించడంతో గెలుపొందిన వారికి ఎఫ్ ఆర్




ఓ సుభాష్, ఎంఈఓ జయరాజ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు రాథోడ్ మను, హైమావతి, ప్రభాకర్, శుక్రు, తిరుపతి టీచర్ తదితరులు పాల్గొన్నారు.

## లంబడి తండా గ్రామంలో నేత్రదానం

**బెల్లంపల్లి, జూలై 29, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి మండలం లంబాడి తండా గ్రామానికి చెందిన రంగా రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందారు.ఈ సందర్భంగా మంగళ వారం మృతురాలి



కొడుకు రంగా ప్రశాంత్ తల్లి నేత్రాలను మరో ఇద్దరికి చూపునివ్వాలనే మంచి మనసుతో ఆలోచించి తన తల్లి నేత్రాలను దానం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని లయన్స్ క్లబ్ బెల్లంపల్లి కార్యదర్శి ఎర్ర. ఆదర్శ్ వర్ధన్ కు తెలుపగా ఆదర్శ్ వర్ధన్ ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ అధికారులతో సంప్రదించి నేత్రదానానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు.ఈ నేపథ్యంలో ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నుండి డాక్టర్ ప్రసాద్ గ్రామానికి వచ్చి రాజేశ్వరి నేత్రాలను సేకరించి తీసుకు వెళ్ళారు. తల్లి నేత్రాలు దానం చేసిన రాజేశ్వరి కుటుంబానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇషిక ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ పై ఆరోపణలు చేస్తే సహించం : మేనేజింగ్ డైరెక్టర్ రఘువర్మ

**జన్నారం, జూలై 29, సూర్య మేజర్ న్యూస్ :** ఇషికా ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ పై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించబోమని, వాస్తవాలు లేకుండా తప్పుడు ప్రచారాన్ని కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని ఇషిక ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ రఘువర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి, సాంస్కృతిక పరిజ్ఞానం ద్వారా భవిష్యత్తును నిర్మించడంపై ఇషిక కట్టుబడి ఉందని అన్నారు. ఇషికా ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ ఏ పాఠశాల తోనూ భాగస్వామ్యం చేసుకోలేదని కంప్యూటర్ క్లాసులు మరియు క్లాసికల్ డాన్స్ శిక్షణ వంటి కార్యకలాపాలు మాత్రమే జరుగుతున్నాయన్నారు. మునుముందు రోజుల్లో ఇలానే ప్రచారం చేస్తే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

### పశు వైద్యకేంద్రం చుట్టూఉన్న

## మురికి నీరును తొలగించండి

**బేల, జులై 29, సూర్య మేజర్ న్యూస్ :**

మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రం ముందు నీరు నిలిచి పోవడంతో



పశువుల వైద్యం కోసం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కుశనాపెల్లి అంకుష్ అన్నారు.మండల అధికారులు మాత్రం ఫ్రై డే డ్రై డే పేరిట గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచిస్తున్నారు తప్ప ఇక్కడ తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం పక్కనే ఉన్న పశు వైద్య కేంద్రం పైన దృష్టి సారించడం లేదని పేర్కొన్నారు. పశు వైద్య కేంద్రంలో నిల్వ ఉన్న మురికి నీరుని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు రమేష్, గణేష్, అంకుష్,అశోక్ , ఆకాష్ తదితరులు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### - ఎఫ్ఆర్ఓ శ్రీధర చారి

**జన్నారం, జూలై 29, సూర్య మేజర్ న్యూస్ :**

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలని ఇంధన్ పల్లి రేంజ్




ఆఫీసర్ శ్రీధర చారి కోరారు. ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా జన్నారం మండలం కలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి శ్రీధర చారి మాట్లాడుతూ తమ తమ ఇండ్ల వద్ద మొక్కలను నాటుకొని కంటికి రెప్పలా కాపాడుకోవాలని దీంతో ఆక్సిజన్ లభిస్తుందని అన్నారు. అదేవిధంగా కష్టమైన ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేరాల నివారనే లక్ష్య

### - గంజాయి నిర్మూలన పై ప్రత్యేక దృష్టి

### - నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

**కడెం,జూలై 29, సూర్య మేజర్ న్యూస్ :**

పోలీసు స్టేషన్ల తనికులలో భాగంగా కడెం పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పి జి. జానకి షర్మిల మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా స్టేషన్ కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసుల గురించి ఎస్ఐ ను అడిగి తెలుసుకున్నారు.అనంతరం సిబ్బంది ఎవరెవరూ ఏయే విధులు నిర్వహిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలని అన్నారు.నేరాల నివారనే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. గంజాయి వినియోగం పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాల నివారణ పై చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏవైనా విపత్కర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే అధికారులు,సిబ్బంది సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్ఐ సాయి కిరణ్ ను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



### అర్హులైన ప్రతి పేదవారికి

# రేషన్ కార్డులు

### - ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**



అర్హులైన ప్రతి పేదవారికి రేషన్ కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కెరమెరి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఆసిఫాబాద్ రాజసవ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు మాట్లాడుతూ అర్హత గల ప్రతి లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుదీర్ఘకాలం తర్వాత నిరుపేదలకు రేషన్ కార్డులు అందుతున్నాయని, రేషన్ కార్డు పేదవారికి వరం లాంటిదని తెలిపారు. రేషన్ కార్డుతో సన్న బియ్యం, ఆరోగ్యశ్రీ పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లతో పాటు అనేక సంక్షేమ పథకాల లబ్ది పొందుతారని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన పేదలకు చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు సన్నబియ్యంను ఉచితంగా అందిస్తుందని, ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. సన్న బియ్యం పంపిణీ ద్వారా కుటుంబ ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డు దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. రేషన్ కార్డులలో పేర్ల మార్పులు, చేర్పులు కొరకు సమీప మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసినట్లయితే తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో చాలా దరఖాస్తులు రేషన్ కార్డు కొరకు వచ్చేవి అని, వచ్చే నెల నుండి కొత్త రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేషన్ కార్డుదారులు సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రేషన్ డీలర్లు సన్నబియ్యాన్ని పక్కదారి పట్టించినట్లయితే 6ఎ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది రేషన్ కార్డులపై అర్జీలు వస్తే వెంటనే విచారణ పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు.అనంతరం శాసనమండలి సభ్యులతో కలిసి మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటి, తహసిల్దార్ భూమేశ్వర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అంజద్ పాషా, పౌరసరఫరాల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆదివాసుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

### - ఎమ్మెల్యే పాయల్ శంకర్

**బేల, జులై 29, సూర్య మేజర్ న్యూస్ :**

ఆదివాసుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.మంగళవారం బేల మండలము లోని చప్రాల గ్రామంలో రెండు కోట్ల 30 లక్షల జన్మన్



నిధుల వ్యయంతో నిర్మించనున్న బాలురుల హాస్టల్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసుల అభివృద్ధికి కేంద్రం జన్ మన్ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. జన్ మన్ నిధుల ద్వారా ఆదివాసి గ్రామాల నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే ముఖ్య లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐకి సన్మానం

**కాసిపేట, జూలై 29, సూర్య మేజర్ న్యూస్ :**

కాసిపేట పోలీస్ స్టేషన్ కు నూతనంగా వచ్చిన ఎస్ఐ ఆంజనేయులను కాసిపేట మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు అట్టిపల్లి శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో మున్నూరు కాపులు ఘనంగా సన్మానం చేశారు. పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ ఆంజనేయులును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు అట్టపల్లి శ్రీనివాస్ పటేల్, ఆత్మ చైర్మన్ రౌత్ సత్తయ్య పటేల్, ప్రధాన కార్యదర్శి ఇంగు నారాయణ పటేల్, జిల్లా యూత్ అధ్యక్షుడు తేంద్ర శ్యాం పటేల్, జిల్లా అధికార ప్రతినిధి సిద్దం తిరుపతి పటేల్, గౌరవాధ్యక్షులు సిద్దం బాపు పటేల్, ఉపాధ్యక్షులు సిద్ధం రాములు పటేల్, మడిపల్లి తిరుపతి పటేల్, సలహాదారులు చింతల భీమయ్య పటేల్, గ్రామ అధ్యక్షులు పానగంటి తిరుపతి పటేల్, గుర్రాల వేణు పటేల్, నామసాని రాజు పటేల్, అడప పాపయ్య పటేల్, ఉస్కమల్ల పవణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## జజ్జరవెల్లి ప్రాథమిక పాఠశాలలో ఐడికార్డ్స్,టై,బెల్టు,బ్యాగులు ఉచిత పంపిణీ

**బెల్లంపల్లి, జూలై 29, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా ప్రాథమిక పాఠశాల జజ్జరవెల్లిలో మంగళవారం విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంకతి తిరుపతి తన సొంత ఖర్చుతో 49 మంది విద్యార్థులకు 6 వేల రూపాయల విలువగల ఐడికార్డ్స్, టై, బెల్టు ఉచితంగా పంపిణీ చేశారు మరియు సహ ఉపాధ్యాయురాలు అయిన రాథోడ్ సంగీత ఐదువేల విలువగల బ్యాగులను స్వంత ఖర్చుతో ఉచితంగా పంపిణీ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు ఐడి కార్డ్ మరియు కాపీరైటింగ్ బుక్స్ ,పెన్నులు, పెన్సిల్ లు పిల్లలకు ఉచితంగా ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల విద్యాధికారి సెడ్మికి రాము మాట్లాడుతూ గ్రామంలోని మొత్తం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నందుకు హాజరు శాతం పెంచుతున్నందుకు ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సునీత, బానేష్, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం


**కాసిపేట, జూలై 29, సూర్య మేజర్**

కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో అటవీ శాఖ అధికారులు అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, విద్యార్థులకు పులి యొక్క ప్రాముఖ్యత, అడవుల రక్షణ గురించి అటవీ క్షేత్ర అధికారి పూర్ణచందర్ తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించి, ప్రతిమా ,ద్వితీయ ,తృతీయ బహుమతులను అటవీ క్షేత్రాధికారి సిహెచ్ పూర్ణచందర్,పాఠశాల ప్రిన్సిపల్ ఖలీల్ అందజేశారు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు బి ప్రవీణ్ నాయక్, గౌరీ శంకర్, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ శ్రీధర్, ఉపాధ్యాయులు గణేష్, అశోక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సీఓఈ స్పాట్ కౌన్సిలింగ్

**బెల్లంపల్లి, జూలై 29, సూర్య మేజర్ న్యూస్:**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డాక్టర్ అలుగు వర్షిని ఆదేశానుసారంగా బాలుర సిఓఈ బెల్లంపల్లి యందు ఇంటర్నెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూప్స్ యందు ఖాళీగా ఉన్న సీట్ల కొరకు స్పాట్ కౌన్సిలింగ్ ఈనెల 31వ తేదీన నిర్వహించబడును అని ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ తెలిపారు. ఈ నెల 31వ తేదీ రోజున ఉదయం 9 గంటల నుండి ఒంటిగంట వరకు అప్లికేషన్ ఫామ్స్ సమర్పించ వలసి ఉంటుందని ఒంటి గంట తర్వాత ఎట్టి పరిస్థితుల్లో తీసుకోబడవు అని స్పాట్ కౌన్సిలింగ్ కి వచ్చేటప్పుడు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకురావలని అన్నారు. మార్చి 2025 రెగ్యులర్గా ఉత్తీర్ణత సాధించి 70 శాతం మార్కులు పైన ఉన్న విద్యార్థులు మాత్రమే కౌన్సిలింగ్ హాజరు కాగలరని, యంపిసి, బైపిసి గ్రూపుల యందు ఖాళీ సీట్ల వివరాలు ఎస్సీ క్యాటగిరి యందు ఎంపీసీ 10, బైపిసి 20 సీట్లు కలవు, ఎస్టీ క్యాటగిరి యందు ఎంపీసీ1, బైపీసీ 2, బీసీ కేటగిరి యందు ఎంపీసీ 2, బైపిసి 5, ఓసి క్యాటగిరి యందు ఎంపీసీ 1, బైపిసి 2, మైనార్టీ కేటగిరి యందు ఎంపీసీ 1, బైపిసి 1 సీట్లు కలవని ప్రిన్సిపాల్ తెలిపారు.




## బెల్లంపల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మైనారిటీ గురుకులంలో ఉచిత ఆరోగ్య శిబిరం

**బెల్లంపల్లి, జూలై 29, సూర్య మేజర్ న్యూస్:**

టిజిఎంఆర్ఎస్ అండ్ జేసి మైనారిటీ గర్ల్స్ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కాలేజీలో, లయన్స్ క్లబ్ బెల్లంపల్లి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జనని హాస్పిటల్ మరియు శాంభవి ఐ విషన్ సెంటర్ తమ విలువైన సహకారం అందించారు. ఈ ఆరోగ్య శిబిరంలో వైద్యులు డా. జగదీష్ నాయుడు, ఎంబిబిఎస్ ఎమర్జెన్సీ ఫిజీషియన్, శాంభవి ఐ విషన్ సెంటర్ అంజయ్య కంటి వైద్య నిపుణులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 270 మంది విద్యార్థులు పాల్గొని తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకున్నారు. వారికి అవసరమైన ఉచిత మందులను కూడా పంపిణీ చేయడం జరిగింది. ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడంలో లయన్ క్లబ్ అధ్యక్షురాలు అరుణ సుందరి, కార్యదర్శి ఆదర్శ్ వర్ధన్ రాజు, డి. నారాయణ రావు, కె. నర్సయ్య, తిరుపతి రెడ్డి, జయచందర్, పాఠశాల ప్రిన్సిపాల్ నీలు, పాఠశాల సిబ్బంది మరియు హాస్పిటల్ సిబ్బంది లయన్స్ క్లబ్ సభ్యులు ముఖ్య పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన పెంపు చేయడమే కాక, సమాజసేవ పట్ల దృక్పథాన్ని మరింత బలపరిచిందని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు.

## బెల్లంపల్లి పట్టణంలో రోడ్లన్నీ గుంతలమయం...

### - ఎమ్మెల్యే గడ్డం వినోద్ జర రోడ్లను పట్టించుకోండి.

### - ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్

**బెల్లంపల్లి, జూలై 29, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి పట్టణంలో ఎంసీపీఐయు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లి లో ఏరియా హాస్పిటల్ నుండి మొదలుకుంటే కొత్త బస్టాండ్ వరకు రోడ్డు గుంతలతో అస్తవ్యస్తంగా మారాయని, బెల్లంపల్లిలోని ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే ఇదే తంతు కొనసాగుతుందని, సంవత్సర కాలంలో మూడు నెలలు మాత్రమే రోడ్డు సక్రమంగా ఉంటుందని తాత్కాలికంగా మట్టి పోసి నింపడమే తప్ప రోడ్డుకు శాశ్వత పరిష్కారం మాత్రం చేయడం లేదని, రోడ్డు ఇలా గుంతలు పడడం వల్ల ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు కింద పడిపోయి కాళ్లు చేతులు విరగొట్టుకునే పరిస్థితి ఏర్పడుతున్నాయని, దీనివల్ల ఎంతో మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఒకసారి బెల్లంపల్లి లో ఉన్న అధికారులు అందరూ కూడా వారి వారి గవర్నమెంట్ వాహనాలలో తిరగకుండా ఒకసారి మంచి మనసు చేసుకొని ద్విచక్ర వాహనాల మీద వెళ్తే ప్రజల బాధ వారికి అర్థమవుతుందని, ఇప్పటికైనా సంబంధిత ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించి ఏరియా హాస్పిటల్ నుండి కొత్త బస్టాండ్ వరకు కొత్త రోడ్డును వేయించి బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజల ప్రాణాలను కాపాడాలని అదేవిధంగా రోడ్లు ఊడువక దుమ్ము, దూలి, కండ్లలో పడి ప్రజలు ఇబ్బందులు ఎదురకొంటున్నారని వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా శుభ్రం చేయించి ప్రజలకు ఇబ్బంది కలగకుండ చూడాలని ఎంసిపిఐయూ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం లేనియెడల ఎంసీపీఐయు పార్టీ ఆధ్వర్యంలో తగు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, మండల కార్యదర్శి ఆరేపల్లి సతీష్, తొగరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## భోజనంలో తాజా కూరగాయలు వాడాలి

### - ఎంపిడివో ప్రవీణ్ కుమార్

**వాంకిడి, జూలై 29,సూర్య మేజర్ న్యూస్**

వసతి గృహ విద్యార్థులకు అందించే భోజనంలో తాజా కూరగాయలు మాత్రమే వాడాలని ఎంపిడివో ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వసతి, తరగతి గదులను పరిశీలించారు. సరుకులు, స్థాక్ వివరాలు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పోషకాలతో కూడిన భోజనం వడ్డించాలని, పాఠశాల ఆవరణలో నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు అధికంగా ఉన్నందున దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. యన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి ప్రసన్న, తదితరులు ఉన్నారు.

## సింగరేణి చైర్మన్ జన్మదిన వేడుకలు

**కాసిపేట,జూలై 29, సూర్య మేజర్ న్యూస్**

మందమరి ఏరియా కాసిపేట 1 ఇంక్లైన్లో మంగళవారం సింగరేణి చైర్మన్ బలరాం నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గని మేనేజర్ సతీష్, ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్,ఫిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ, ఐఎన్టియుసి కేంద్ర ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్ దాస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు చోల్లంగి శ్రీనివాస్, పర్వతి సురేష్,నాగేశ్వరరావు,రంజిత్,చౌడ లింగన్న అశోక్,శ్రీనివాస్,అబ్దుల్, గణేష్,మహేష్,రఘురామ్,రవి,రాజన్న,అధికారులు డిప్యూటీ మేనేజర్ వెంకటేష్,అండర్ మేనేజర్ బుక్య సుమన్,సంక్షేమ అధికారి మీర్జా గౌస్ జీషాన్,ఉద్యోగులు పాల్గొన్నారు.



### జూలై 31న గురుకుల కళాశాలలో

## స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్

**సోన్, జులై 29 సూర్య మేజర్ న్యూస్:** సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి ఆదేశానుసారం, సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల లెఫ్ట్ పోచంపాడ్ లో మిగిలిపోయిన సీట్లకు జూలై



31 న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎచ్ఈసి, సిఈసి గ్రూపుల్లో స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ జరుగుతుందని సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రిన్సిపల్ ఆర్. ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తమయొక్క 10వ తరగతి ఒరిజినల్ టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రములతో కళాశాలలో ఉదయం.9 గంటలనుండి 1.00 గంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వారికి మధ్యాహ్నం 2గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించి, సీట్లు ఎల్లాట్మెంట్ రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. వివరాలకై ఈ 8985850279 నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు.

## పులులను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలి

**ఖానాపూర్ జూలై 29 సూర్య మేజర్ న్యూస్**

పులులను సంరక్షిస్తే పర్యావరణం దానంతట అదే వృద్ధి చెందుతుందని ఖానాపూర్ ఫారెస్ట్ డివిజన్ అధికారి ఏ.శివకుమార్ అన్నారు. అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం ను పురస్కరించుకొని మంగళవారం మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ అడవిలో వన్యప్రాణుల సమతౌల్యం పులులతోనే సాధ్యమవుతుందన్నారు.



పులుల రక్షణకు అటవీ శాఖ నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు పోతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సమతుల్యత లోపించడంతోనే జరుగుతున్నాయన్నారు. అనంతరం వ్యాసరచన,ఉపన్యాస,చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు దీక్షిత,కౌశిక్,అభినయ్, హిమనీ, అన్విక్ష, చారి,నందిని,మహేశ్వరి, శివ లకు బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు రత్నయ్య, సదాశివుడు,నవీన్,ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు,కుర్ర శేఖర్,తౌంటి శంకర్, వెన్నం అంజయ్య,షేక్ ఇమ్రాన్ లు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

### పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**సోన్, జూలై 29 సూర్య మేజర్ న్యూస్:**

మండల కేంద్రంలో మంగళవారం అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. మండలానికి చెందిన 863 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరూ రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రతీ సంక్షేమ పథకానికి రేషన్ కార్డు తప్పనిసరి అని అన్నారు. రేషన్ కార్డు లేని కారణంగా గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమయ్యారని అన్నారు. కొత్తగా రేషన్ కార్డు పొందిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే నెల నుండి కొత్త రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ జరుగుతుందని అన్నారు. రేషన్ కార్డు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నా కళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్,



ఎంపీడీవో సురేష్, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, నాయకులు సరికెల గంగన్న, హరీష్ రెడ్డి, నరేష్, సాగర్, అశోక్, నవీన్, రాజేశ్వర్, రవి, శ్రీనివాస్,నర్సారెడ్డి, నర్సయ్య, ముత్యం రెడ్డి, గంగారెడ్డి, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ , పౌరసరఫరాల శాఖ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## తొలితరం మహిళ ఉద్యమ నాయకురాలు కామ్రేడ్ కంది రాజనర్సక్క కు జోహార్లు

**రామకృష్ణాపూర్, సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి ప్రాంతవిప్లవ మహిళాఉద్యమంలో తొలితరం నాయకురాలు కంది రాజనర్సక్క. ఆనాటి సిపిఐ (యం యల్ )విమోచన సీపీ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన అనేక పోరాటల్లో తన భర్త కంది రాజారత్నం వెంటే నడిసింది. తాగునీరు కోసం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యపై ఆనాడు గోదావరిఖనిలో ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో జరిగిన ఖాళీ కుండల ఊరేగింపులో బస్తీల మహిళలను కదిలించడంలో కీలకంగా వ్యవహరించింది. సారా అమ్మకాలకు, వరకట్న దూరచారాలకు వ్యతిరేకంగా పిఓడబ్ల్యూ పిలుపులను గోదావరిఖనిలో విజయవంతం చేయడంలో కార్యకర్తగా, నాయకురాలిగా క్రియాశీలక పాత్ర పోషించింది అనడంలో అతియోశక్తి లేదు. ఆనాడు రివిజనిస్ట్ శక్తులు బలంగా ఎదుగుతు కార్మికుల, పిడిత ప్రజల అభిమానం పొందుతున్న విప్లవ ఉద్యమంపై చేసిన అనేక దాడులకు కామ్రేడ్ రాజనర్సక్క కుటుంబం గురైంది. లంపెన్ శక్తులకు తోడు రాజ్యం చేసిన అనేక దాడులను ఎదురుకుంటూ అక్రమ కేసుల్లో జైలు జీవితం గడిపింది. భర్త కామ్రేడ్ రాజారత్నం 1988లో పార్టీ పిలుపుతో పూర్తి గా రహస్య జీవితం లోకి పోవడం అప్పుడే సిపిఐ (యం యల్) విమోచన -ప్రతిఘటన పేర రెండు వర్గాలుగా విడిపోవడం జరిగింది కామ్రేడ్ వినోదన్న, మధుసూదన్ రాజ్,సామా అంతిరెడ్డి, ఫణిభాగ్చి, కె డి స్థై, రాధక్క(సీపీ రెడ్డి సహచరి), సోమాచారి నాయకత్వంలో సిపిఐ (యం యల్ )ప్రతిఘటనలో రాజారత్నం కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాపార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చూడటం, కామ్రేడ్ రాజనర్సక్క పి ఓ డబ్ల్యూ రాష్ట్ర కన్వీనింగ్ కమిటి కన్వీనర్ గా సామా చిన్న పూలక్క కో కన్వీనర్ గా మహిళా ఉద్యమానికి నాయకత్వం వహించారు. మేడారం అసెంబ్లీ స్థానానికి1988లో, పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి1991లో సిపిఐ (యం యల్) ప్రతిఘటన పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు.పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసిన క్రమంలో



ఎన్నికల్లో విప్లవ పార్టీ లన్నిటిపై ప్రభుత్వం కుట్రపూరితంగా అణిచివేత ప్రయోగించింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఎన్ వి కృష్ణయ్య అభ్యర్థిగా ఉన్న సిపిఐ (యం యల్) విమోచన పార్టీ కార్యకర్తలను, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో సిపిఐ (యం యల్ )ప్రతిఘటన పార్టీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేయడం, ప్రచార బృందలను లాకప్ లోవేసి చిత్రహింసలు పెట్టడం జరిగింది. విచ్చలవిడిగా ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో బూటకపు ఎన్కౌంటర్స్ చేయడం తో జూన్ 11-1991నా రాష్ట్ర బంద్ కు అప్పటి సిపిఐ( యంయల్ )పీపుల్స్ వార్, సిపిఐ( యం యల్ )ప్రతిఘటన, సిపిఐ (యం యల్ )విమోచన గ్రూపులు ఉమ్మడిగా పిలుపు నిచ్చాయి. పౌర హక్కుల, ఓపిడిఅర్ నేతలు బాల గోపాల్, కన్నభిరామ్, నేతృత్వంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పర్యటించారు. గోదావరిఖని, మంచిర్యాల ప్రాంతంలో కామ్రేడ్ మేకల వెంకన్న, దొంగరి శ్రీను, బండ్ల ఐలన్న, సుభాష్, సత్తన్న అనే రైతంగా నాయకులను షెల్టర్ల నుండి ఎత్తుకెళ్లి బూటకపు ఎన్కౌంటర్స్ లో కాల్చి చంపి ఎన్నికల ప్రచారాలకు రాజ్యం ఆటంకాలు కలిగించింది. ధర్మారంఏరియాలో తాండ్ర కృష్ణ, సదానందం, కత్తుల సురేష్ అనే కార్యకర్తలపై సారా జిపు దాహనం కేసు మోపి తీవ్ర చిత్ర హింసలు పెట్టారు. గోదావరిఖనిలో లీగల్ నాయకులైనా కామ్రేడ్ ముత్తన్న, కట్ట విశ్వనాథ్,(నేడు ఇఫ్ట్ రాష్ట్ర అధ్యక్షుడుగా ఇంకా విప్లవ కార్మికోధ్యమంలో కొనసాగుతున్న తొలితరం నాయకుడు) అలాగే లక్ష్మణ్, అశోక్, రామగుండం నరేష్, ఖలీల్,లను అడుగడుగునా బెదిరింపులకు గురిచేసి పార్లమెంట్ అభ్యర్థి రాజనర్సక్క వెంటా సింగరేణి గనుల్లో మీటింగలు పెట్టవద్దంటు, కార్మిక వాడల్లో పోస్టర్ లు వేయవద్దంటు, కరపత్రలు పంచవద్దంటు. ప్రచార బృందాలతోనే పోస్టర్లు చింపించడం, చూసి ఆనాడు ప్రచారం కోసం వచ్చిన నిజామాబాద్, తూ.గో, ప. గో జిల్లాల కార్యకర్తలు నిర్భంధ పరిస్థితికి విస్మయం చెందారు. అనేక అటుపోట్ల మధ్య విప్లవ పార్టీ నాయకురాలిగా 1995వరకు కొనసాగిన రాజనర్సక్క తన భర్త కామ్రేడ్ కంది రాజారత్నం ఎన్కౌంటర్ తర్వాత పార్టీ నుండి



వైదొలిగి. రామకృష్ణపూర్ ఏరియాలో జీవనం సాగించింది సిపిఐ పార్టీ నుండి ఎంపీటీసీ గా ఒక పర్యాయం గెలిచింది. సిపిఐ అనుబంధ మహిళా సమాఖ్య లో జిల్లా స్థాయి నాయకురాలిగా పనిచేసి వయసురీత్యా, అనారోగ్యం వల్ల ఉద్యమాలకు దూరం అయినా. 2025-ఫిబ్రవరి లో గోదావరిఖనిలో జరిగిన ఏఐఎఫ్టియు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ కు హాజరై.గత వైభవం తిరిగి రావాలంటే యువత విప్లవల్లోకి రావాలని. ఆనాటి విజయలను తెలియజేస్తూ జెనరల్ కౌన్సిల్ కు విప్లవ జేజేలు తెలియజేశారు.ఇటీవల తీవ్రమైన అనారోగ్యం తో వరంగల్ ఎం జి ఎం హాస్పటల్ లో అడ్మిట్ అయినా రాజనర్సక్క శనివారం రాత్రి 10గంటల సమయం లో మరణించారు. కామ్రేడ్ రాజనర్సక్క అంత్యక్రియలు మంగళవారం రామకృష్ణపూర్ నిర్వహించిన అంత్యక్రియలకు కుటుంబం సభ్యులతోపాటు పూర్వ సహచరులు ఏఐఎఫ్టియు, ఎస్జిఎల్బికెఎస్,ఆర్సిఎస్, పి ఓ డబ్ల్యూ (స్త్రీవిముక్తి), పి డి ఎస్ యు ( వి) అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఎ సి ఎఫ్) పక్షనా కడసారి అరుణ జోహార్లు తెలిపారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు-డిఎంహెచ్ఓ హరీష్ రాజ్

**మంచిర్యాల టౌన్, సూర్య మేజర్ న్యూస్**

మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ మంగళవారం పాత మంచిర్యాల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు బస్తీ దవాఖానలు, పల్లె దవాఖాన లు,ఉప కేంద్రాలలో వైద్య సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని కోరారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటి వ్యాధులు, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు అందుబాటులో ఉండడానికి వైద్య ఆరోగ్యశాఖ ఎల్లప్పుడు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. వైద్య సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సెలవులు మంజూరు చేయాలని, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగాని, వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనుమతి తర్వాతనే సెలవులు మంజూరు చేయాలి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



వైద్యులు గ్రామపంచాయతీ, మండల అభివృద్ధి అధికారి, పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బందితో సమన్వయం చేసుకొని వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్సలు అందించాలి సూచించారు. తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ద్వారా అందిస్తున్న పరీక్షలను ప్రజలకు తెలియజేయాలి అన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అసంక్రమణ వ్యాధులు గుర్తించి చికిత్సలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలిని సూచించారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది ఈ సమయంలో అందుబాటు లో ఉండాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాలలో సాయంత్రం ఉండే వైద్య సిబ్బంది వివరములను గోడపైన ఉంచాలి అన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి అన్నారు. కుక్కకాటు, పాము కాటుకు సంబంధించిన మందులను ఎల్లవేళలా అందుబాటు లో ఉంచుకోవాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాటు జరిగిన చర్యలు తీసుకో బడుతయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ శివప్రతాప్, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు వైద్య సిబ్బంది వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

## అదనపు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

**లక్షెట్టిపేట, జూలై 29, సూర్య మేజర్ న్యూస్ :**

వ్యవసాయ రంగానికి నాణ్యమైన కోతలు లేని విద్యుత్ అందించడం కోసమే అదనపు పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశామని మంచిర్యాల ఎన్.పి.డి.సి.ఎల్ సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ జాడే ఉత్తమ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్.పి.డి.సి.ఎల్ సూపరింటెండెంటింగ్ మాట్లాడుతూ.. మండలంలోని జెండా వెంకటపూర్ సబ్ స్టేషన్ లో మంగళవారం అదనంగా 5 ఎంఏ గల పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. లో - ఓల్టేజి లేకుండ నాణ్యమైన విద్యుత్ సరఫరాతో వ్యవసాయ విద్యుత్ మోటర్లు కాలిపోకుండ ఉండడానికి, రైతు ఆర్థికంగా నష్ట పోకుండా నాణ్యమైన విద్యుత్ అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ ఎంఎ కైసర్, ఎం ఆర్ టి డిఈ బానోత్ రాజన్న, ఎం ఆర్ టి ఏడిఈ శరత్ కుమార్ లక్షెట్టిపేట ఎడిఈ ఎం. ప్రభాకర్ రావు, ఏఈ గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖానాపూర్ లో ఘనంగా నాగుల పంచమి

**ఖానాపూర్ టౌన్ జులై 29 సూర్య మేజర్ న్యూస్**

ఖానాపూర్ లో భక్తులు మంగళవారం ఘనంగా భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి పర్వదినాన్ని జరుపుకున్నారు. మండలం లో వివిధ గ్రామాల్లో అత్యంత నిష్ఠగా జొన్న పాలాలు,వేయించిన చెనిగలు,పాలు తీసుకొని మహిళా



భక్తులు పాము పుట్టలవద్దకి వెళ్ళారు. ఈ కాలంలో సర్పాలు అధికంగా తిరుగుతుంటాయని,వాటితో మానవాళికి ఎలాంటి ప్రమాదం రాకూడదని భావించి,పెద్దలు పుట్ట చుట్టూ పొదలు లేకుండా శుభ్రం గా చేసి పాములను కొలువాలని ఒక ఆచారంగా పెట్టారు. ముఖ్యంగా నాగ దోషం ఉన్నవారు పుట్టలో పాలు పోస్తే అన్నీ శుభాలు జరుగుతాయని భావిస్తారు. సంతానం లేనివారు ఈ రోజు ప్రత్యేక పూజలు చేస్తే సంతాన భాగ్యం కలుగుతుందని నమ్మి కొలుస్తారు. మండలం లోని మస్కాపూర్, బాదంకుర్తి,సుర్జాపూర్,తర్లపాడ్ తదితర గ్రామాల్లోని శివాలయాల చెంత ఉన్న పుట్టల్లో మహిళా భక్తులు పాలు పోశారు.

### పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించిన

# ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

సోన్, జూలై 29 సూర్య మేజర్ న్యూస్: మండలలోని పాక్ పట్ల, సిద్ధుల కుంట గ్రామాలలో ఇటీవల అనారోగ్య కారణంతో మరణించిన బాధిత కుటుంబాలను మంగళవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



పరామర్శించారు. పాక్పట్ల గ్రామానికి చెందిన బొప్పరం సాయన్న తల్లి మరణించడంతో ఆయనను ఆయన కుటుంబ సభ్యులను, నల్ల ముత్యం తల్లి మరణించగా ఆయనను ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే సిద్దుల కుంట గ్రామంలో కొండూరు సురేష్ తండ్రి కొండూరు మల్లేష్ మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఆయన వెంట బిజెపి మండల అధ్యక్షులు మార గంగారెడ్డి ,హరీష్ రెడ్డి, నర్సారెడ్డి, ముత్యం రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఉదయ్, గంగారెడ్డి, గంగన్న, సాయన్న రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

# అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**లక్షెట్టిపేట, జూలై 29, సూర్య మేజర్ న్యూస్ :**

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఇంటిగ్రేటెడ్ బి.ఏ బి. ఎడ్ బోధించుటకు అతిధి అధ్యాపకుల పోస్టుల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మహాత్మ సంతోష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఖాళీల వివరాలు ఎకనామిక్స్ 1, పొలిటికల్ సైన్సు 1, ఎడ్యుకేషన్ 1, ఇంగ్లీష్ 1, మరియు సైకాలజీ 1 సంబంధిత సబ్జెక్టులో పీజీ లో 55 శాతం మార్బ్స్ మరియు బి.ఎడ్. అని తెలియజేశారు. బాచిలర్ డిగ్రీ భోధించుటకు ఇంగ్లీష్ 1, తెలుగు 1, కెమిస్ట్రీ 1. ఫిజిక్స్ 1, డైరీ సైన్సు 1, క్రాప్ ప్రొడక్షన్ 1, స్టాటిస్టిక్స్ 1, కంప్యూటర్ అప్లికేషను 1, మరియు కంప్యూటర్ సైన్సు 1 అని తెలియజేశారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ లో 55 శాతం మార్బ్స్ మరియు నెట్, సెట్, పిహెచ్ డి ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలియజేశారు. ఆసక్తి కలిగినవారు దరఖాస్తులను చివరి తేది 30-07-2025 సంబంధిత ధ్రువపత్రాలతో కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ మహాత్మా సంతోష్ తెలియజేశారు.

# లకంపూర్ అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ -కలెక్టర్ రాజార్శిషా

లకంపూర్ జూలై 29, సూర్య మేజర్ న్యూస్

మండలంలోని లకంపూర్ అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ రాజా ర్శిషా మంగళవారం తనిఖీ చేసి సందర్శించారు. పిల్లలకు బాలింతలకు గర్భిణీ స్త్రీలకు పోషకాహారం అందజేయాలని అంగన్వాడి టీచర్ కు సూచించారు. ప్రతినె 5 తేదీలోపు పిల్లలను బరువు ఎత్తు జబ్బ చుట్టుకొలత చూడాలని కలెక్టర్ సూచించారు. నిధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని కలెక్టర్ కోరారు. ఈ తనిఖీలు అంగన్వాడి టీచర్ శ్రీలత ఆయా గ్రామస్తులు ఉన్నారు.



# లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ

**మందమర్రి, జులై 29, సూర్య మేజర్ న్యూస్.**

మందమర్రి మండలంలోని చిర్రకుంట గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి వివేక్ వెంకట స్వామి, ఎంపీ వంశీకృష్ణ ఆదేశాల మేరకు మంగళవారం చిర్రకుంట గ్రామంలో ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్ తో కలిసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందే రాంచందర్ 60 ఆహార భద్రత కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదల సంక్షేమం కొరకు పాటుపడుతుందన్నారు. గతంలో పది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ పార్టీ ఏ ఒక్కరికి రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏడాది పాలనలో, రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య, పిఏసిఎస్ డైరెక్టర్ పెద్దాల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు సంపత్ రావు, కొప్పుల రాములు, అత్తి పోశయ్య, దుర్గం సుధాకర్, కామెర బాలయ్య, మెండే మహేందర్, పంచాయతి కార్యదర్శి రమేష్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ శెట్టి సత్యనారాయణ, రేషన్ కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ఆత్మహత్య చేసుకుని వివాహిత మృతి

**లక్షెట్టిపేట, జూలై 29, సూర్య క్రైమ్ న్యూస్ :**

మండలంలోని అంకత్ పల్లి గ్రామానికి చెందిన గెల్లు మౌనిక అనే 29సంవత్సరాల వివాహిత కడుపునొప్పి, తలనొప్పి భరించలేక పంటకు కొట్టే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలి గత 8సంవత్సరాల క్రితం పెద్దంపేట కు చెందిన మహేష్ తో వివాహం కాగా 7సంవత్సరాల అన్యశ్రీ అనే కుమార్తె, 8నెలల భువన అనే కొడుకు ఉన్నారు. మృతురాలు గత 5,6, నెలల నుండి తలనొప్పి, కడుపునొప్పితో బాధపడుతుంది. ఆసుపత్రుల్లో చెపించుకొని మందులు వాడినా నొప్పి తగ్గకపోవడంతో నెల రోజుల క్రితం తల్లిగారింటికి వచ్చి ఉంటుంది. ఈనెల 24న కడుపునొప్పి రావడంతో నొప్పి భరించలేక ఇంట్లో ఆత్మహత్య కు పాల్పడింది. కుటుంబీకులు గమనించి లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 27వ తారీకు సాయంత్రం మృతి చెందింది. మృతురాలి తల్లి గనవేని శంకరవ్వ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు.



గెల్లు మౌనిక ఫైల్ ఫోటో

### నాగ పంచమి సందర్భంగా ముక్కులు చెల్లించుకున్న మహిళలు

**రామకృష్ణాపూర్, జులై 29, సూర్య మేజర్ న్యూస్**

శ్రావణమాసం లో వచ్చే నాగ పంచమి సందర్భంగా మంగళవారం




క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో గల వివిధ దేవాలయాల్లో ఉన్న నాగేంద్ర స్వామి కి పూజలు చేసి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్న మహిళలు

# పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**పెంబి, జులై 29,సూర్య మేజర్ న్యూస్:**

మద్యానికి బానిసై భార్య మందలించడంతో మనస్థాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెంబి మండలంలోని శెట్పల్లి గ్రామ పంచాయతి జంగుగూడ లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగుగూడ కు చెందిన మెస్రం కృష్ణ (32) మద్యానికి బానిసై, ఏ పని చేయక పోవడంతో



మద్యం తాగ వద్దని అతని భార్య మందలించడంతో మనస్థాపానికి గురై గుర్తు తెలియని పురుగుల మందు తాగి సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.చికిత్స నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు మృతుడి భార్య గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెంబి ఎస్సై ఎం.హనుమండ్లు తెలిపారు.

# గ్రంథాలయం ఏర్పాట్లపై ఠాగూర్ స్టేడియం పరిశీలన

**రామకృష్ణాపూర్, జులై 29, సూర్య మేజర్ న్యూస్**

మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వచ్చిన ప్రతిపాదనను పరిశీలించడానికి మంగళవారం ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సివిల్



డివైఎస్ఈ శ్రీధర్, స్టేడియంలో ఉన్న గదులను పరిశీలించడం జరిగింది, ఇందులో భాగంగా యోగా హాల్ పక్కన ఉన్న పాత స్టేజిని కూలగొట్టి గదులను ఆధునికరించి గ్రంథాలయం ఏర్పాటుకు సిద్ధం చేయవలసిందిగా సివిల్ అధికారులను సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు క్రీడాకారులు పాల్గొన్నారు.

### రోడ్డు వేయండి.. భగత్ సింగ్ నగర్ బస్తీ వాసుల

# కష్టాలు తొలగించండి

**మందమర్రి, జులై 29, సూర్య మేజర్ న్యూస్.**

పట్టణంలోని మార్కెట్ ఏరియా సమీపంలోని భగత్ సింగ్ నగర్ లో అడుగడుగున గుంతలతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని, పలు మార్లు విన్నవించుకున్నప్పటికీ అధికారులు పెడ చెవిన పెడుతున్నారని,



ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతనంగా రోడ్ వేసి కాలని వాసుల ఇబ్బందులు తొలగించాలని 14వ వార్డుకు చెందిన భగత్ సింగ్ నగర్ బస్తి వాసులు కోరారు. మంగళవారం కాలని వాసులు విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్ ప్రాంతంలోని భగత్ సింగ్ నగర్ రోడ్డు, దీపక్ నగర్, శ్రీపతి నగర్ లకు ముఖ్య కూడలి లాంటిదని అలాంటి భగత్ సింగ్ నగర్ లో అడుగడుగున గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇదివరకు వేసిన రోడ్డు పూర్తిగా పాడైపోయిందని, ఇరుకుగా ఉన్న రోడ్డును వెడల్పు చేసి నూతనంగా రోడ్డు వేయాలని గతంలో సింగరేణి జిఎం కు, మున్సిపల్ కమిషనర్ కు పలు మార్లు వినతులు సమర్పించామని, ఈ సమస్యను తీర్చాలని ఎమ్మెలకు కు కూడా మా బాధను తెలిపామని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు స్పందించడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించని పక్షంలో మున్సిపల్ కార్యాలయం, జిఎం కార్యాలయాలను ముట్టడిస్తామని, జిఎం కార్యాలయ ఎదుట నిరాహార దీక్ష చేపడతామని కాలని వాసులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో భగత్ సింగ్ కాలని వాసులు రాయబారపు కిరణ్, వెంకన్న, రసూల్, సోమయ్య, శేఖర్, పోలు శ్రీనివాస్, జమాల్, కిష్టయ్య, సురేందర్, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.